



జేసీతో మాట్లాడుతున్న నాయకులు

భూ నిర్వాసితులను ఆదుకోవాలి : వ్యకాసం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

నాసన్ , బెల్ , ఎయిర్ బస్ కంపెనీల కోసం భూములు ఇచ్చిన రైతులకు పెనుకొండ ఆర్‌డిఒ ప్రతిపాదన మేరకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని వ్యవసాయ కార్మికసంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వ్యకాసం ఆధ్వర్యంలో నిర్వాసితులు బుధవారం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జాయింట్ కలెక్టర్‌కు సమర్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కంపెనీల కోసం పాలసముద్రం గ్రామస్తుల నుండి 545.34 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించిందన్నారు. పేదలు, దళితులు, బలహీన వర్గాల వారు కూడా భూసేకరణకు సహకరించి భూములు ఇచ్చారన్నారు. వీరందరూ దళితులు , మైనార్టీలు , బీసీలు అని అన్నారు. వీరికి ప్రస్తుతం ఎలాంటి స్థిరాస్తులు లేవని 2013 భూ సేకరణ చట్టం ప్రకారం రావాల్సిన ప్యాకేజ్ అమలుకు నోచుకోలేదని చెప్పారు. దీంతో నిర్వాసితులు హైకోర్టును ఆశ్రయించారని, పెనుకొండ సబ్ కలెక్టర్‌కు అనేక విజ్ఞప్తులు చేశారని అన్నారు. పెనుకొండ ఆర్డీవో ఉత్తర్వుల నివేదిక ప్రకారం పరిశీలించి హైకోర్టు పిటిషన్ దారులు అందరికీ 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పునరావాసం కల్పించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన జాయింట్ కలెక్టర్ వీలైనంత తొందరలో నిర్వాసితులు అందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న , జిల్లా కోశాధికారి వెంకటేష్ , జిల్లా కమిటీ సభ్యులు రమాదేవి , నిర్వాసితులు అచ్చమ్మ , వెంకట లక్ష్మమ్మ , రమిజాబి , అంజనప్ప, ఖాదర్‌బాషా, నారాయణ, లక్ష్మీనరసింహ, భవన నిర్మాణ కార్మిక సంఘం పెనుకొండ నియోజకవర్గ కన్వీనర్ కొండా వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు లేనిదే బయటకు రాగలవా..?

వైఎస్.జగన్‌పై మంత్రి సవిత ఆగ్రహం



ప్రజాశక్తి-పెనుకొండ

పోలీసులు లేనిదే కాలు బయట పెట్టలేని నీవు ఆ పోలీసులను అవమానకరంగా దూషించడం ఏంత వరకు సమంజసమని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. పులివెందుల ఎమ్మెల్యే జగన్ మోహన్ రెడ్డి అధికార దాహంతో కావాలనే డ్రామాలాడుతున్నారని తెలిపారు. గడిచిన ఎన్నికల్లో ఆయన పార్టీని ప్రజలు 11సీట్లకు పరిమితం చేసినా సిగ్గు రాలేదన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో వైఎస్ జగన్ పోలీసులపై చేసిన వ్యాఖ్యలు అత్యంత హేయం అన్నారు. మాజీ ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటు అన్నారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేస్తే జగన్‌కు రక్షణగా నిలిచింది పోలీసులే అన్న విషయాన్ని జగన్ గుర్తుంచుకోవాలన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేందుకు ఆయన ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపి అధికారంలో ఉన్నప్పుడు బడుగు బలహీన వర్గాలపై చేసినా అరాచకాలు, దాడులను మర్చిపోయారా అంటూ ప్రశ్నించారు. ఇప్పటికైనా జగన్ బాధ్యతాయుతంగా వ్యవహరించి మాట్లాడాలని మంత్రి తెలిపారు.

నేడు మంత్రి కొల్లు రవీంద్ర రాక



ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర గురువారం నాడు జిల్లాకు రానున్నారు. ఈ మేరకు మంత్రి పర్యటన వివరాలను కలెక్టర్ టిఎస్.చేతన్ తెలియజేశారు. గురువారం ఉదయం అనంతపురంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు. మధ్యాహ్నం 2-45 గంటలకు గోరంట్ల మండలం పాలసముద్రం క్రాస్‌కు చేరుకుంటారన్నారు. అక్కడ ఏపీఎస్ బిసిఎల్ పరిపాలన విభాగాన్ని ప్రారంభిస్తారు. సాయంత్రం 4 గంటల వరకు నాసిన్ కేంద్రం వద్ద అధికారులతో సమావేశాన్ని నిర్వహిస్తారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన బెంగళూరుకు బయలుదేరి వెళతారని కలెక్టర్ ప్రకటనలో తెలియజేశారు.



హిందూపురం అంబేద్కర్ సర్కిల్లో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు



ధర్మవరంలో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

భారాలు మోపడమే మోడీ పాలన

◆ పేదల నడ్డి విరిచేలా గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరల పెంపు ◆ సిపిఎం ఆధ్వర్యంలో నిరసనలు

ప్రజాశక్తి-హిందూపురం, ధర్మవరం రూరల్

కేంద్రంలోని ప్రధాన నరేంద్ర మోడీ పేదలపై భారాల వేయడమే విధానంగా పరిపాలన సాగిస్తున్నారని సిపిఎం నాయకులు విమర్శించారు. ఇటీవల పెంచిన గ్యాస్ సిలిండర్, పెట్రోల్, డీజిల్ ధరలకు వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యంలో హిందూపురంలో నిరసన తెలిపారు. పెంచిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో నిరసన ర్యాలీ చేపట్టారు. అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన తెలుపుతూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు జెడ్పీ.శ్రీనివాసులు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు హరి మాట్లాడుతూ మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం శ్రీరామనవమి కానుకగా గ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంచి ప్రజలకు భారాల కానుకను ఇచ్చిందన్నారు. పథకాలతో మహిళలను అన్ని విధాలా ఆదుకుంటున్నామని ప్రకటిస్తూ, మరో వైపు ఇలా భారాలు వేయడం దేనికి సంకేతం అన్నారు. ఇప్పటికే పెరిగిన నిత్యావస వస్తువుల ధరలతో జనం సతమతం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సమయంలో వారికి అండగా ఉండాల్సింది పోయి ధరలు పెంచడం ఏమిటని ప్రశ్నించారు. ప్రపంచ వ్యాప్తంగా చమురు ధరలు దగ్గినప్పటికీ పెట్రోల్, డిజిల్ ధరలు మాత్రం తగ్గించడం లేదన్నారు. అదానీ, అంబానీ ఆస్తులు పెద్ద ఎత్తున పెరగడానికి సహకరిస్తూ ప్రజలపై భారాలు మోపుతున్నారని మండిపడ్డారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎవరూ నోరు మెదపకుండా బిజెపి మతం, కులం లాంటి సున్నితమైన విషయాలను ముందుకు తెచ్చి ప్రజలను మౌనంగా ఉండేలా చేస్తున్నారని చెప్పారు. ఎంతో కాలం ఈ ఆటలు సాగవని భారాలు వేస్తూ ఇలానే పాలన సాగిస్తే ప్రజలను తగిన సమయంలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. పెంచిన భారాలపై రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి స్పందించాలన్నారు. పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ సిలిండర్ల ధరను తక్షణం తగ్గించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రాము, రామకష్ణ. రాజప్ప, బాబావాలి, నందీశ్వర, రామాంజనప్ప, రమణ, జ్యోతమ్మ, మూర్తి, జయరాములు, చంద్రమ్మ పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : పెంచిన గ్యాస్ డీజిల్ పెట్రోల్ ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు ఎస్‌హెచ్. బాషా, ఎ. మారుతి, సిఐటియు నాయకులు జెవి రమణ, టి అయుబ్‌ఖాన్ మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పేదలపై మోయలేని భారాన్ని వేస్తోందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు నిరంతరం పెరుగుతూనే ఉన్నాయని, డీజిల్ పెట్రోల్ ధరలు పెంచుతున్నారని, విద్యుత్ బిల్లులను విపరీతంగా పెంచుతున్నారని అన్నారు. పేద బడుగు బలహీన వర్గ ప్రజలు ఒకవైపు ఉపాధి లేక వలసలు పోతున్నారని ,పేదల జీవన పరిస్థితులు మరింత దిగజారుతున్నాయని కార్మికులకు పేదలకు కొనుగోలు శక్తి పడిపోతోందని ఆవేదన వ్యక్త చేశారు. పెంచిన గ్యాస్ ధరలను, డీజిల్ పెట్రోల్ ధరలను, విద్యుత్ ధరలను తగ్గించాలని లేని పక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎల్ ఆదినారాయణ, ఎస్ హైదర్‌వలి, చేనేత కార్మిక సంఘం నాయకులు గుంపు హరి,వి. వెంకటస్వామి, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న అధికారులు, నాయకులు

ప్రభుత్వ విద్యను బలోపేతం చేద్దాం : డిఇఒ

ప్రజాశక్తి - కొత్తచెరువు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను బలోపేతం చేస్తామని డిఇఒ కిష్టప్ప, పెనుగొండ డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి పద్మప్రియ పేర్కొన్నారు. కొత్తచెరువు లోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో సత్యసాయి జిల్లా యుటిఎఫ్ శాఖ రూపొందించిన ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేద్దామని రూపొందించిన గోడ పత్రికలను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను అధికంగా చేర్పించి బలోపేతం చేయాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేరేవిధంగాచర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల గురించి తల్లిదండ్రులకు తెలియచెప్పి పాఠశాలలో చేర్పించాలని కోరారు. యుటిఎఫ్ వారు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందుకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్ర రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం సుధాకర్, జిల్లా కార్యదర్శులు లక్ష్మీనారాయణ , తాహిర్ వలి, శివశంకర్, అజాంబాషా, లతా దేవి, గాయత్రి, అమర్, నారాయణరెడ్డి, నాగరాజు, కృష్ణారెడ్డి, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

టెక్నికల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి- కొత్తచెరువు

ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, సిడి యాప్ సంయుక్తంగా సీసీటీవీ ఇన్‌స్టాలేషన్ కోర్సులను బుక్కపట్నం డిగ్రీ కళాశాలలో ప్రారంభిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ, ప్రిన్సిపల్ మక్బూల్ హుస్సేన్ తెలిపారు. ఈ మేరకు వారు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఐటిఐ, ఇంటర్, డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ అయిన విద్యార్థులు ఈ కోర్సులకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎంపికైన వారికి మూడు నెలల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఆసక్తి గలవారు స్కిల్ హబ్ కోఆర్డినేటర్ సంప్రదించాలని కోరారు.

వికలాంగుల సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి-హిందూపురం

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి అందరూ కృషి చేద్దామని మండల విద్యాశాఖ అధికారి గంగప్ప సూచించారు. బుధవారం పట్టణంలోని ఎంజిఎం పాఠశాల ఆవరణలో ఉన్న భవిత కేంద్రంలో విభిన్న ప్రతిభావంతులకు రూ.2.65 లక్షల విలువ చేసే ఉపకరణాలను పంపిణీ చేశారు.

మురుగు కాలువల్లో పూడికతీత పనుల పరిశీలన

ప్రజాశక్తి-హిందూపురం

మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ సూచించారు. బుధవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న మురికి కాలువల్లోని పూడికతీత పనులను ఆయన పరిశీలించారు.కాలువలలో నీరు అక్కడిక్కడే నిలిచిపోయి, కాలువలోని నీరు బయటికి వచ్చి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, డ్రైనేజ్ లలో ఉన్న మొత్తం సిల్ట్ ను తొలగించి, కాలువలోని నీరు ముందుకు కదిలే విధంగా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్ఒ శోభన్ రెడ్డి, శానిటరీ ఇన్స్ పెక్టర్ నిజాముద్దీన్, టీడీపీ నాయకులు హిదాయతుల్లా, డైమండ్ బాబా, బుల్లెట్ జియావుల్లా, బాషా, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్పోర్ట్స్ మీట్

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

స్థానిక రెయిన్బో ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో వార్షిక స్పోర్ట్స్ మీట్ 2024-2025 కార్యక్రమాన్ని పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపల్ జయసింహారెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్ ఐ మల్లికార్జున్ రెడ్డి, సత్యసాయి జిల్లా స్పోర్ట్స్ ఇన్‌ఛార్జి నరసింహ నాయక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ శారీరకంగా మానసికంగా ఉల్లాసాన్ని కలిగించడానికి ఆటలు ఉపయోగపడతాయన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థినీ విద్యార్థులు ఆంగ్ల భాషలో పట్టు సాధించాలన్నారు. ఈ సందర్భంగా వివిధ ఆటల పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఇంగ్లీష్ గ్రామర్‌లో ప్రతిభ కనపర్చిన వారికి నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ రాకేష్, విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

చెరువుల అభివృద్ధికి నివేదికలు సిద్ధం చేయాలి

మంత్రి సత్యకుమార్ యాదవ్



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

.మైనర్ ఇరిగేషన్ శాఖ ద్వారా ధర్మవరం నియోజకవర్గంలో చెరువులను అభివృద్ధి చేయడానికి ఎంత మేరకు నిధులు అవసరమో నివేదికలు సిద్ధం చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఆదేశించారు. బుధవారం ధర్మవరం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో మైనర్ ఇరిగేషన్, పంచాయతీరాజ్ శాఖ, గ్రామీణ నీటిపారుదల శాఖ, ఎన్టీఆర్ హౌసింగ్ నిర్మాణాలపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం ఆర్డీవో మహేష్, మున్సిపల్ కమిషనర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజల జీవన ప్రమాణాల్ని మెరుగుపరిచే దిశగా ప్రతి శాఖ సక్రమంగా వ్యవహరించాలని సూచించారు. ధర్మవరం నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, సమన్వయంతో పనిచేస్తే అన్ని కార్యక్రమాలూ విజయవంతంగా అమలవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ముదిగుబ్బ మండలంలోని యోగి వేమన రిజర్వాయర్ ప్రాజెక్టు పనులను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. 85 చెరువులను అభివృద్ధి చేయడానికి 96 పనులు ఆమోదించి ప్రభుత్వానికి రూ. 179.9 లక్షల రూపాయలు నిధులు అవసరమని నివేదికలు అందజేశామన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ట్రిబుల్ ఆర్ ద్వారా 21 చెరువుల అభివృద్ధి చేయడానికి రూ. 795 లక్షల రూపాయలు అవసరమని కేంద్ర ప్రభుత్వానికి నివేదికల సమర్పించామన్నారు. హెచ్‌ఎన్‌ఎస్ఎస్, పిఎబిఆర్ కాలువల ద్వారా 14 చెరువులు నీరు అందజేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలో తాడిమర్రి, ముదిగుబ్బ, ధర్మవరం అర్బన్‌లో నీటి ఎద్దడి నివారణ కొరకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా మాజీ అధ్యక్షులు సంధి రెడ్డి శ్రీనివాస్, మంత్రి నియోజకవర్గ ఇన్‌ఛార్జి హరీష్ బాబు, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, ఆర్డీవో మహేష్, మైనర్ ఇరిగేషన్ అధికారి విశ్వనాథరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి మల్లికార్జునప్ప, హౌసింగ్ అధికారి శంకర్ లాల్, ఎస్‌సిపిఆర్ మురళీమోహన్, నేషనల్ హైవేస్, హార్టికల్చర్ అధికారులు, ఆర్ అండ్ బి నేషనల్ హైవే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి



ఖాళీబిందెలతో నిరసన

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

స్థానిక మదీనా మజీద్ వీధి వెనుక కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆకాలనీవాసులు కోరారు. ఈ మేరకు బుధవారం రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ పుట్టపర్తి డివిజన్ కార్యదర్శి మున్నా ఆధ్వర్యంలో కదిరి హిందూపురం ప్రధాన రహదారిపై ఖాళీ బిందెలతో రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ కాలనీలో గత కొన్ని రోజులుగా నీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని విమర్శించారు. తప్పనిసరి పరిస్థితుల్లో రోడ్డు ఎక్కాల్సి వచ్చిందన్నారు. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. వెంటనే నీటి ట్యాంక్ ద్వారా నీటిని సరఫరా చేయించారు. అయితే తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కాలనీవాసులు కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు లడ్డు బాబాజాన్, బాబా, చంద్ బాషా, బాల, మైమున్, వెంకటేష్, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - తలుపుల

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి నెల 9వ తేదీన జరిగే ప్రధానమంత్రి సురక్షా మాతృత్వ అభియాన్ లో భాగంగా మండల వ్యాప్తంగా ఉన్నటువంటి హై రిస్క్ గర్భిణులకు డాక్టర్ అఫ్తాఫ్ ,అశ్రిత వైద్యపరీక్షలు నిర్వహించారు. 62 మంది గర్భిణులను పరీక్షించి అందులో 12 మంది రక్తహీనత ఉన్నట్లు గుర్తించి మందులు అందజేశారు. 9 మందిని ఉచిత అల్ట్రా సౌండ్ స్కానింగ్ కొరకు కదిరికి పంపారు. మదర్ థెరిస్సా గారి స్ఫూర్తితో మన్సూర్ ఫ్రెండ్స్ అసోసియేషన్ వారు ప్రతి నెలా మాదిరిగానే ఈ నెల కూడా, చికిత్స కొరకు ఆసుపత్రికి వచ్చిన గర్భిణులకు వారితో పాటు వచ్చినవారికి, వైద్య సిబ్బందికి భోజన సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. అంతే కాక వైద్యశాలకు, పలు ప్రభుత్వ ఆఫీసులకు గడియారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామనాయక్, ఎస్ఐ నరసింహులు, ఆర్ఐ శ్రీనివాస్. మన్సూరు, వాసిం, ఇర్ఫాన్, బాబు, రమణప్ప, నాయుడు, చెన్నకేశవులు, చిరంజీవి, మల్లోత్ర తదితరులు పాల్గొన్నారు.

యువకుడు అనుమానాస్పద మృతి

మృతదేహంతో పోలీసుస్టేషన్ ముందు బాధితుల ధర్నా

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

మండల పరిధిలోని ఇనగలూరు గ్రామానికి చెందిన యువకుడు బుధవారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు.యువకుడి మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ మృతుని బంధువులు, గ్రామస్తులు బుధవారం రాత్రి స్థానిక పోలీసుస్టేషన్ ముందు ప్రధాన రహదారిపై మృతదేహంతో ధర్నా నిర్వహించారు. ఈఘటనకు సంబంధించిన వివరాలు... గ్రామానికి చెందిన హైదర వలి కుమారుడు రహంతుల్లా(38) మండల పరిధిలోని బాబాసాహెబ్ పల్లి వద్ద నూతనంగా నిర్మిస్తున్న కోళ్ల పరిశ్రమ వద్ద వెల్డింగ్ పనులకు బుధవారం వెళ్లాడు. అక్కడ అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. రహంతుల్లా మృతిపై మృతుని కుటుంబసభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. గ్రామస్తులతో కలసి పోలీసుస్టేషన్ ముందు మృతదేహంతో ధర్నా నిర్వహించారు. రహంతుల్లా మృతికి కారణమైన నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.



మృతదేహంతో ఆందోళన చేస్తున్న బాధితులు

ప్రతి సంక్షేమ పథకం లబ్ధిదారులకు చేరాలి

ప్రజాశక్తి - నంబులపూలకుంట

ప్రతి సంక్షేమ పథకం అర్హులైన లబ్ధిదారులకు చేరాలని ఎంపిపి ఈటె రాము ఆదేశించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం సాధారణ మండల సర్వసభ్య సమావేశం మండల అధ్యక్షుడు ఈటే రాము అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పలువురు సభ్యులు తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఉపాధి హామీ పథకం పై చర్చ జరిగింది. క్షేత్ర స్థాయిలో నిజమైన కూలీలకు బిల్లులు అందటం లేదని ఎంపిపి సభ దృష్టికి తీసుకువచ్చారు. కూలీలకు పని కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో అంజినప్పతో పాటు ఆయాశాఖల అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 'పది' మూల్యాంకనం

ప్రజాశక్తి - కొత్తచెరువు

కొత్తచెరువు జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో ఈనెల 3 తేదీ నుంచి నిర్వహిస్తున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం బుధవారం ముగిసినటుల డిఇఒ కిష్టప్ప తెలిపారు. ఈ మూల్యాంకనంలో జిల్లాలోని 950 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారన్నారు మొత్తం1,75,198 పరీక్ష జవాబు పత్రాలు మూల్యాంకనం చేసినట్లు చెప్పారు. 7 రోజులపాటు జరిగిన మూల్యాంకనానికి విద్యాశాఖ మౌలిక వసతులు ఏర్పాటు చేసిందన్నారు. మూల్యాంకనానికి సహకరించిన విద్యాశాఖ అధికారులకు, పోలీస్ సిబ్బందికి, విద్యుత్ శాఖ అధికారులకు, నాన్ టీచింగ్ స్టాఫ్‌కి డిఇఒ కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా గంధం వేడుకలు



పార్థనలు చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని ఖబ్రస్థాన్ లోనిహజరత్ సయ్యద్ పీర్ ఖాద్రి వారి 63వ గంధం వేడుకలు బుధవారం వారి శిష్య బృందం ఘనంగా నిర్వహించింది. గంధం వేడుకల కోసం ఆదోని నుంచి హజరత్ సయ్యద్ పీర్ ఖాద్రి వారి శిష్యులు ప్రత్యేక వాహనంలో వచ్చారు. అందరి సమక్షంలో స్వామివారికి దంధాన్ని సమర్పించారు. అనంతరం గౌసియా మసీదు మౌలానా షాహిద్ రజా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. హజరత్ సయ్యద్ పీర్ ఖాద్రి కుమారులు సయ్యద్ మదూమ్ హుస్సేన్ వారి సూచనల మేరకు ఈ వేడుకలను నిర్వహించినట్లు వారి శిష్యులు తెలిపారు. హజరత్ సయ్యద్ పీర్ ఖాద్రి హిందూపురం పట్టణంలో ఉపాధ్యాయుడిగా సేవలను అందించారని. వీరి కుమారులు అయినా సయ్యద్ మదూమ్ హుస్సేన్ పట్టణంలోని ఈసీఎం (ఎంజీఎం) ఉన్నత పాఠశాలలో ఉన్నత విద్యను పూర్తి చేసి, ప్రఖ్యాత భూ శాస్త్రవేత్తగా ఉన్నారని అన్నారు. గతంలో జరిగిన అంటార్కిటికా యాత్రలో ఆంధ్రప్రదేశ్ తరపున పాల్గొని భారత రాష్ట్రపతిచే సత్కరించబడిన మొదటి వ్యక్తి అని చెప్పారు. గంధం వేడుకల్లో పాల్గొన్న వారందరికీ గౌసియా మసీదు ముతువల్లి రహమతుల్లా సేట్ మసీదులో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకల్లో శిష్యులు జిలాన్, రెహమాన్ భాష, హాయిలే సున్నతుల్ జమాత్ అధ్యక్షులు మహబూబ్ దౌల, సెక్రెటరీ రెహమాన్, ట్రెజరర్ షబ్బీర్, ఇస్మాయిల్, జబివుల్లా, సమీర్, ఫారూఖ్, బాబాతో పాటు పెద్ద ఎత్తున ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

రావులచెరువులో గ్రామసభ

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం మండల పరిధిలోని రావులచెర్వు గ్రామంలో బుధవారం రూరల్ ఎస్ ఐ శ్రీనివాసులు తమ సిబ్బంది తో కలసి గ్రామ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గొడవలకు దూరంగా ఉండాలని సూచించారు. సైబర్ క్రైమ్, ట్రాఫిక్ రూల్స్ పైన, డ్రోన్ కెమెరా, డయల్ 100 మరియు మహిళలపై జరిగే నేరాలపైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ పోలీసు, రెవిన్యూ సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నిర్ధారణకు పరీక్షలు

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సి వై, టిబి పరీక్షలను ఆరోగ్య వైద్యాధికారులు డాక్టర్ భాను ప్రకాష్, కమల్ రోహిత్ నిర్వహించి క్షయ వ్యాధి పై అవగాహన కల్పించారు. రెండు వారాలను మించి దగ్గు, బరువు తగ్గడము,రాత్రిళ్ళు జ్వరము రావడం తదితర లక్షణాలు కలిగినవారు వెంటనే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి విజయ కుమారి, ఎంపిహెచ్ఎస్ మురళీధరన్, పిహెచ్ఎన్ దిల్షాద్, ఎంఎల్హెచ్పి జ్యోతి, ల్యాబ్ టెక్నీషియన్ నరేంద్ర, డిటిసి సూపర్వైజర్ అబీద్ బాషా, ఎఎన్ఎం నాగవేణి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి - ముదిగుబ్బ

ముదిగుబ్బ పంచాయతీలోని వడ్డెర్ల కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి కూటమి నాయకులు తుమ్మల మనోహర్, రమేశ్ బాబు, సోమల ప్రకాశ్ నాయుడు బుధవారం భూమి పూజ చేశారు. పంచాయతీ నిధుల నుంచి ముదిగుబ్బలో పాతఊరు, గేటుకొట్టాల, సచివాలయం 3, వడ్డెర కాలనీలో డంపింగ్ యార్డ్ తదితర ప్రాంతాల్లో సీసీ రోడ్లను రూ.28.40 లక్షలతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి లక్ష్మీదేవి చెన్‌రాయుడు, పంచాయతీరాజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

పార్టీ సభ్యత్వ కార్డులు పంపిణీ

ప్రజాశక్తి - తనకల్లు

మండల కేంద్రంలోని సంజీవయ్య నగర్, బూడిదగడ్డ వీధులలో టిడిపి కార్యకర్తలకు పార్టీ సభ్యత్వ కార్డులను బుధవారం పంపిణీ చేశారు. బూత్ కమిటీ కన్వీనర్ చాకివేల శిరీష, మాజీ ఎంపీపీ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు దేశాయ్ రమణారెడ్డి, ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ క్రియాశీలక సభ్యత్వ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రియాశీలక సభ్యత్వరు పొందిన కార్యకర్త ఏదైనా ప్రమాదంలో మరణిస్తే ఆ కుటుంబానికి సుమారు ఐదు లక్షల ప్రమాద బీమా అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌ఛార్జి మహబూబ్‌బాషా, టిడిపి సీనియర్ నాయకులు చిన్న కుళ్లాయప్ప, మహబూబ్ బాషా, లాలు, రామచంద్ర, హైదర్ వలి తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల శ్రమదానం

ప్రజాశక్తి -పెనుకొండ టౌన్

పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్ వన్ ఆధ్వర్యంలో బుధవారం కళాశాలలో శ్రమదానం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు చెట్లు దగ్గర ఉన్న పిచ్చి మొక్కలు తొలగించి చెట్లకు పాదులు తీసి నీరు వదిలారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కేశవ రావు, ప్రోగ్రాం అధికారి డాక్టర్ ప్రతాప్, ఎన్ఎస్ఎస్ వాలెంటీర్లు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది సర్వే

ప్రజాశక్తి-నంబులపూలకుంట

వ్యాధుల నిర్ధారణపై మండల కేంద్రంలో వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే చేపట్టారు. ప్రతి వ్యక్తికీ బిపి,షుగర్ వ్యాధులపై నమూనాలు సేకరించి వ్యాధి నిర్ధారణ చేశారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ ఆదినారాయణ, కిషోర్ రెడ్డి, ఎఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ ప్రారంభించారు. నియోజకవర్గం లోని నిరుపేదలకు అనారోగ్యనికి సంబంధించిన పరీక్షలు ఉచితంగా చేస్తున్నారని దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని పరిశీలించిన డిఎంహెచ్ఓ : మండల కేంద్రంలోని హైస్కూల్లో బుధవారం జరుగుతున్న ఉచిత మెగా వైద్య శిబిరాన్ని డిఎంహెచ్ఓ ఫైరోజా బేగం పరిశీలించారు. మొబైల్ బస్సులో నిర్వహిస్తున్న నోటి, రొమ్ము, గర్భసయ్య క్యాన్సర్ల పరీక్షలను పరిశీలించారు. రోగ నిర్ధారణ, ఆరోగ్య, వైద్య పరీక్షలు, సలహాలు పొందుతున్న రోగులతో ఆమె మాట్లాడారు. దీర్ఘకాలిక వ్యాధుల రోగులను పరిశీలించి తగు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్. రాజేంద్ర, డాక్టర్. శ్వేత తదితరులు ఉన్నారు.

వార్డెన్‌పై చర్యలకు డిమాండ్

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

బీసీ సంక్షేమ వసతి గృహంలో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టకుండా వారి కడుపులు కొడుతున్న వార్డెన్ పై చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా వెనుకబడిన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ నిర్మల జ్యోతి కి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర మంజుల నరేంద్ర, సాకే వినయ్, హరి మాట్లాడుతూ జిల్లాలోని ఎన్పి కుంట, తలుపుల బిసి హాస్టల్ వార్డెన్ ఆంజనేయులు మెనూ ప్రకారం విద్యార్థులకు సరైన భోజనం పెట్టకుండా ఇబ్బందులు పెడుతున్నారన్నారు. హాస్టల్ లో లేని విద్యార్థులను సైతం నమోదు చేసుకుని బిల్లును చేసుకుంటున్నారని ఆరోపించారు.

'కుశలవ' భూబాధితులకు న్యాయం చేయాలి



ఐక్యత చాటుతున్న ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

అధికారులు, పాలకులు కలిసి చదువురు రాని దళిత రైతుల భూములను చట్ట వ్యతిరేకంగా కుశలవ ఆర్గానిక్ ప్రొడక్ట్స్ సంస్థకు కట్టబెట్టారనిప్రభుత్వం వెంటనే ఎవరి భూములు వారికి ఇచ్చి న్యాయం చేయాలని వామపక్ష ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బాధిత దళిత రైతులు అధికారులు న్యాయం చేయక పోవడంతో న్యాయ స్థానాన్ని ఆశ్రయించారు. విషయం తెలుసుకున్న కుశలవ సంస్థకు అనుకూలంగా ఉన్నటు వంటి కొంతమంది ప్రజాప్రతినిధులు అవినీతి అధికారులు కలిసి బాధిత రైతులపై తప్పుడు కేసులు బనాయిస్తామని బెదిరిస్తు భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. విషయం తెలుసుకున్న ప్రజాసంఘాల నాయకులు బాధిత రైతులకు అండగా నిలిచారు. ఈ మేరకు వారు బుధవారం పట్టణంలోని పాండురంగ నగర్ లో ఉన్నా కనకదాసు కళ్యాణ మంటపంలో భూ బాధితుల పోరాట కమిటీ అధ్యక్షులు టి.గోపాలకృష్ణ అధ్యక్షతన సంఘీభావ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు సాకే హరి, బహుజన వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు శివ రామకష్ణ, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు హరి, సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్ పి శ్రీనివాసులు, లైఫ్ వరల్డ్ కన్వీనర్ ఉదయ్, ముస్లిం నగారా ఉమర్ ఫరూక్, సిపిఐ వినోద్ కుమార్, ఓపిడిఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, చైతన్య గంగిరెడ్డి, పర్యావరణ వేత్త భాస్కర్ రెడ్డి, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు లేపాక్షి మండలం కొండూరు, కొర్లకుంట పరిసర ప్రాంతంలో ప్రభుత్వం దళితుల అభివృద్ధి కోసం అసైన్డ్ భూములను గతంలో ఇచ్చిందన్నారు. ఇందులో 150 మంది రైతులకు సంబందించిన 250 ఎకరాల భూమిపై పెత్తందారుల కన్ను పడిందన్నారు. 2015 నుండి 2019 మధ్యకాలంలో ప్రజా ప్రతినిధులు, అవినీతి రెవెన్యూ అధికారులు కలిసి నిరక్షరాస్యులైన దళితుల యొక్క భూములను అడ్డదారిలో వివిధ రూపాల్లో దురాక్రమణ చేశారని విమర్శించారు. భూ బాదిత దళితులు గత నాలుగు సంవత్సరాల నుంచి తమ భూములు తమకు ఇప్పించాలని వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు చేస్తున్నప్పటికి ప్రజా ప్రతినిధుల్లో గాని అధికారుల్లో గాని కనీస చలనం కన్పించలేన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు బాదిత దళిత రైతుల భూములను వారికి ఇవ్వాలని లేని పక్షంలో వామ పక్ష, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ సభ్యులు రామాంజనేయులు, సిపిఎం బాబావలి, ఎఐటియుసి మారుతి రెడ్డి, తూమ కుంట కార్మిక నాయకులు రవికుమార్, రైతు సంఘం నాయకులు చలపతి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలను సాధించి లాభాల బాటలోకి తెద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రజారవాణాధికారి

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

అనుకున్న లక్ష్యాలను సాధించి ఆర్టీసీని లాభాల బాటలోకి తెచ్చి జిల్లాని రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలుపుదామని జిల్లా ప్రజా రవాణా అధికారి మధుసూదన్ పిలుపునిచ్చారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో జిల్లాలోని డిపో మేనేజర్లు, ట్రాఫిక్, గ్యారేజీ సూపర్వైజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి డిపోలో అనుకున్న లక్ష్యాలను సాధించడానికి ఆదాయ మార్గాలను ఎంచుకుని లాభాల బాటలోకి వచ్చే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా బస్సులు సమయపాలన పాటించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పర్యాటక కేంద్రాలకు అదనపు బస్సులను నడిపి ఆదాయం పొందాలన్నారు. దూర ప్రాంతాలకు వెళ్లే బస్సులను శుభ్రంగా ఉంచుకోవాలని, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, కార్మికులలో చైతన్యం తీసుకురావాలని అన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా కండక్టర్లకు, డ్రైవర్లకు, గ్యారేజీ సిబ్బందికి అవగాహన కల్పించాలన్నారు. 66 మంది సిబ్బందికి ఇంక్రిమెంట్లు పెండింగ్లో ఉన్నాయని వాటిని పరిష్కరించాలని డిపో మేనేజర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిపిఎం రమేష్, జిల్లాలోని ఆర్టీసీ డిపోల మేనేజర్లు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయం



సమస్యను వింటున్న మంత్రి సవిత



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూర

ప్రజాశక్తి-పెనుకొండ

ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి సవిత అన్నారు. బుధవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో స్పెషల్ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. పెనుకొండ మండలంలోని రాంపురం ,శెట్టిపల్లి ,గోనిపేట అడదాకులపల్లి ,నాగులూరు మావుటూరు, పంచాయతీలలోని ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి సంబందిత శాఖ అధికారులను ఆదేశించారు. ప్రజలనుంచి వచ్చిన అర్జీలను పీజీఆర్ఎస్ లో నమోదు చేయించారు.. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించొద్దని మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఆనంద్ కుమార్, తహశీల్దార్ శ్రీధర్, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

డీలర్ల సమస్యల పరిష్కారానికి కృషి : డీలర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రి సవిత అన్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలోని రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీలర్లు వారి సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఆ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి హామీ ఇచ్చారు. మంత్రి మాట్లాడుతూ రేషన్ దుకాణాల్లో ప్రజలకు ఇబ్బంది కలగకుండా సరుకులు సరఫరా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లై అధికారులు, ఆర్డీవో, తహశీల్దార్లు, సిఎస్‌డిటిలు తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్ : ఎక్కడ చూసినా ఆస్తి తగాదాలే ప్రధాన సమస్యగా ఉన్నాయనిరెవిన్యూ, పోలీస్ యంత్రాంగం ప్రత్యేకంగా కృషి చేసి శాశ్వత పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి కోరారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం కొత్తచెరువు, బుక్కపట్నం , పుట్టపర్తి మండలాల ప్రజల సమస్యల పరిష్కారం కోసం అధికారులతో కలిసి పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై ప్రజలు ఇచ్చిన అర్జీలను వారు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ భూ సమస్యలకు రాజీమార్గమే శాశ్వత పరిష్కారం అన్నారు. చిన్నచిన్న సమస్యలకు పంతాలకు పోయి పట్టుదలతో కోర్టులకు వెళితే జీవితాంతం న్యాయం కోసం న్యాయస్థానం , పోలీసుల చుట్టూ తిరిగి ఆర్థికంగా నష్టపోయే అవకాశం ఉందన్నారు. నియోజకవర్గంలో ఎక్కడ తాగునీటి సమస్య రాకుండా ఎంపీడీవో, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానిక సంస్థల నిధులను తాగునీటికి మాత్రమే ఉపయోగించేలా స్థానిక సర్పంచులకు సూచించాలని ఎంపిడిఒలు, ఇఒఆర్‌డిలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కొత్తచెరువు, పుట్టపర్తి తహశీల్దార్లు నీలకంఠ రెడ్డి ,కళ్యాణ్, పుట్టపర్తి రూరల్ సిఐ సురేష్, పట్టణ సిఐ సునీత, ఆయా మండలాల ఎంపీడీవోలు నాగేశ్వర్ రెడ్డి, శ్రీనివాసులు, నటరాజ్‌తో పాటు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

మడకశిర : గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తీర్చేందుకే మండలంలోని వివిధ శాఖల అధికారుల సమన్వయంతో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ఎంఎస్. రాజు తెలిపారు. పట్టణంలోని ఆర్ అండ్ బి విశ్రాంతి భవనంలో బుధవారం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామితో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి ప్రజల నుంచి సమస్యల అర్జీలను స్వీకరించారు. ప్రభుత్వం ప్రతి ష్టాత్మకంగా చేపడుతున్న ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదికలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ప్రజలు భూసమస్యలు ఇంటి పట్టా, విద్యుత్తు సమస్యలు,వివిధ సమస్యలకు సంబంధించిన వినతి పత్రాలను సమర్పించారు. సమస్యలను ఆయా శాఖల అధికారులు త్వరగా పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి. మార్కెట్ యార్డ్ చైర్మన్ గురుమూర్తి, అగళి జడ్పిటిసి ఉమేష్, కన్వీనర్లు లక్ష్మీనారాయణ, కుమారస్వామి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో నీటి సమస్య తలెత్తనీయొద్దు



అధికారులతో మాట్లాడుతున్న బాలయ్య పిఎ వీరయ్య

ప్రజాశక్తి-హిందూపురం

మండల వ్యాప్తంగా 14 గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న అన్ని గ్రామాల్లోనూ నీటి ఎద్దడి తలెత్తకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు బాలయ్య పిఎ వీరయ్య ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలోని మండల సమావేశ హాల్‌లో మండల అభివృద్ధి అధికారిణి సరస్వతి తో కలిసి బాలయ్య పీఏ వీరయ్య గ్రామ సర్పంచులు, టిడిపి నాయకులతో పాటు మండల వ్యాప్తంగా ఉన్న అన్ని శాఖల అధికారులతో వివిధ అంశాలపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఆయా విభాగాల వారీగా ప్రభుత్వం నుంచి అమలు అవుతున్న పథకాల మీద సమీక్షించారు. చాలామంది నాయకులు ప్రస్తుతం గ్రామాల్లో నీటి ఎద్దడి తీవ్రంగా ఉందని, సమస్య పరిష్కారం కోసం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్ డబ్ల్యు ఎస్ ఇంజనీర్ బాధ్యతలు స్వీకరించి ఆరు నెలలు అవుతున్నప్పటికీ గ్రామాల్లో ఇంత వరకు పర్యటించలేదని, సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లినప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు నాయకులు ఫిర్యాదు చేశారు. దీంతో ఆర్ డబ్ల్యు ఎస్ ఇంజనీర్ వేణు పై వీరయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. వేసవిలో అప్రమత్తంగా ఉండాల్సిన గ్రామీణ నీటిపారుదల శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. వెంటనే అన్ని గ్రామ పంచాయతీలలో పర్యటించి నీటి ఎద్దడి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ మైనుద్దీన్, మండల విద్యాశాఖ అధికారి గంగప్ప, ఐసిడిఎస్ సిడిపిఒ శాంతి, మండల స్థాయి అధికారులతో పాటు ఆయా పంచాయతీల సెక్రటరీలు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి ఫాదర్‌ఫెర్రర్ కృషి ఆదర్శనీయం



ఫెర్రర్ ఘాట్ వద్ద కేక్ కట్‌చేస్తున్న అన్నేఫెర్రర్, తదితరులు

ఫెర్రర్ జయంతి వేడుకల్లో వక్తలు

ప్రజాశక్తి - బత్తలపల్లి

రాష్ట్రంలో వెనుకబడిన జిల్లా, కరువు కాటకాలతో నిత్యం అల్లాడిపోతున్న జిల్లాలోని పేద ప్రజలు కోసం ఫాదర్‌ఫెర్రర్ చేసి కృషి ఆదర్శనీయమని పలువురు వక్తలు అన్నారు. బుధవారం స్థానిక ఆర్డీటి ఫీల్డ్ కార్యాలయంలో సంస్థ వ్యవస్థాపకులు ఫాదర్ విన్సెంట్ ఫ్రెరర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆర్డీటీఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అన్నే ఫెర్రర్, మనువరాలుతో కలిసి ఘాట్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ భౌతికంగా మన మధ్య లేనప్పటికి ఆయన స్థాపించిన ఆర్డీటీ ద్వారా అమరజీవిగా ఉంటారని అన్నారు. ఆర్డీటీ అంటే నమ్మకంతో వస్తారని, ఆసుపత్రులకు వచ్చే రోగులతో ప్రేమగా మాట్లాడాలని సిబ్బందికి సూచించారు. ఆర్డీటిలో ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నామని అందులో ఒకటైన స్పందించు సాయం అందించు కార్యక్రమం చేపట్టడం చాలా సంతోషకరమని అన్నారు దీని ద్వారా ఎక్కువ మంది చదువుకుంటున్నారన్నారు. ఇటీవల పంజాబ్లో జరిగిన స్కేటింగ్‌లో ఆర్డీటీ స్పోర్ట్స్ సెంటర్‌కు చెందిన వారికి బంగారు పతకాలు రావడం చాలా సంతోషాన్ని ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ పాల్, ఆర్ట్ ప్రమీల, సీఎస్పీ రఘు, ఆసుపత్రి ఇన్‌ఛార్జి హనుమంతరెడ్డి, ఆర్డీటీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రొద్దం : ఆర్‌డిటి వ్యవస్థాపకులు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.బుధవారం మండలంలోని దొడగట్ట గ్రామంలోని ఆర్‌డిటి స్కూల్ లో సి ఓ రామాంజినేయులు ఆదర్వంలో వెలుగు సీసీ సునీతతో కేక్ కట్ చేయించారు. ఈ కార్యక్రమం సీడీసీ మెంబర్లు మూర్తి, గోపాల్, దుర్గప్ప, జయప్ప, శివప్ప కదిరిప్ప, నరసమ్మ, సిద్ధమ్మ, వెంకటలక్ష్మి, రాధమ్మ, బాలు, తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వినాయక వికలాంగుల మండల సమైక్య ఆధ్వర్యంలో ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫెర్రర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో విన్సెంట్ ఫెర్రర్ వికలాంగుల సంఘం నాయకులు రెడ్డప్ప, ఎస్ రెడ్డప్ప, నాగరాజు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : మండలంలోని ధర్మపురి గ్రామంలోనిగామ సచివాలయం ఆవరణంలో విన్సెంట్ ఫెర్రర్ మెమోరియల్ హెల్త్ క్యాంప్స్ వ్యవస్థను సత్య నిర్ధారణ అంకురార్పణ చేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని సోమల రాజు ఫౌండేషన్ వారు మాట్లాడుతూ ఈ ఫౌండేషన్ ద్వారా బహుముఖ ప్రయోజనాలతో కూడిన వైద్య శిబిరాన్ని నిర్వహిస్తామన్నారు. గ్రామస్థాయిలో వృద్ధులకు, వికలాంగులకు త్రైమాసిక శిబిరములు నిర్వహించడం ఫెర్రర్‌కి ఇచ్చే విలువైన నివాళి అని అన్నారు. ఈ శిబిరములో పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ఎస్ వి రాజు, జయరామిరెడ్డి, యువర్స్ ఫౌండేషన్ సభ్యులు కేథా లోకేష్, బ్లడ్ డొనేషన్ ఆక్టివిస్ట్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వివాహితపై అత్యాచార యత్నం

ప్రజాశక్తి - కొత్తచెరువు

మండల పరిధిలోని ఎర్రబెల్లి గ్రామానికి చెందిన ఓ మహిళపై అదే గ్రామానికి చెందిన చంద్ర అనే యువకుడు అత్యాచార యత్నానికి పాల్పడినట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. గ్రామానికి చెందిన ఓ మహిళ మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో వరి కల్లాల దగ్గర ఉండగా అదే గ్రామానికి చెందిన చంద్ర అనే యువకుడు ఆమెపై అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. దీంతో ఆమె ప్రతిఘటించింది. దీంతో ఆ యువకుడు మహిళ గొంతు మేడ భాగంలో దాడి చేయడంతో గాయాలు అయ్యాయి ఈ మేరకు బాధితురాలు కొత్తచెరువు పోలీస్ స్టేషన్లో బుధవారం ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌ఛార్జి సిఐ సురేష్ తెలిపారు.

బస్సు నుంచి జారిపడి మహిళ మృతి

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండల పరిదిలోని అటవీశాఖ నర్సరీ సమీపంలోని మలుపు వద్ద అతివేగంగా వెలుతున్న ప్రయివేటు బస్సు నుంచి మహిళ జారిపడి అక్కడికక్కడే మృతిచెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. అందుకు సంబందించిన వివరాలు... హిందూపురం మండలం ముద్దిరెడ్డి పల్లికి చెందిన ఆదిలక్ష్మమ్మ (47)పని నిమిత్తం పాతచామలపల్లికి వెళ్లి తిరుగు ప్రయాణంలో హిందూపురం వెలుతున్న బాలాజీ బస్సు ఎక్కింది. అప్పటికే ఆ ప్రయివేటు బస్సులో సీట్ల పరిమితి కి మించి నిండుగా ఉన్నారు. పరిమితికి మించి ప్రయాణికులు ఉన్న ఈ బస్సు అతివేగంతో వెళుతోంది. సరిగ్గా నర్సరీ మలుపు వద్ద బస్సు డోర్ వద్ద ఉన్న మహిళ ఆదిలక్ష్మమ్మ ప్రమాదవశాత్తు కింద పడింది. ఈ ప్రమాదంలో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. డ్రైవర్ అతివేగంతో వెళ్ళడం పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం తోనే ప్రమాదం జరిగిందని తోటి ప్రయాణికులు చెబుతున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ పరారయ్యాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి ...

ప్రజాశక్తి - అగళి

మండలంలోని జాతీయ రహదారిలో హుల్లేకెర బ్యాడిగెర మధ్య మలుపు దగ్గర రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. సిరా నుండి మడకశిర వైపు వస్తున్న మడకశిర మండలం వద్రపాలెం నివాసి ఆంజనేయులు అక్కడికక్కడే మృతి చెందాడు. అగళి మండలం దొక్కలపల్లికరి చెందిన రంగనాథ, రంగప్ప గాయపడ్డారు. రంగప్ప పరిస్థితి విషమంగా ఉందని స్థానికులు తెలియజేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎఎస్ఐ శ్రీరాములు,కానిస్టేబుల్ శివకుమార్ తెలిపారు.

ప్రమాదంలో మహిళా కూలీ....

పుట్టపర్తి రూరల్ : మండల పరిధిలోని పెడపల్లి సమీపంలో ఆటో అదుపుతప్పి వ్యవసాయ కూలీ రాధా (32) మృతిచెందింది. పెడపల్లి గ్రామం నుండి బుధవారం ఉదయం వ్యవసాయ పనుల నిమిత్తమై 9మంది వ్యవసాయ కూలీలు అదే గ్రామానికి చెందిన ఫారుక్ ఆటోలో మార్లపల్లి గ్రామం వద్ద వేరుశెనగ చెట్లను తొలగించడానికి బయలుదేరారు. మార్గమధ్యంలో పెడపల్లి పెద్ద తండా దాటగానే ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. అందులో ప్రయాణిస్తున్న రాధమ్మకు తీవ్ర గాయాలు కాగా ఆమెను ధర్మవరం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. ఈమెతో పాటు ప్రయాణిస్తున్న మోషిని కి కాలు విరగగా, గొల్ల కేశవ భార్య కు చెయ్యి ఫ్రాక్చర్ అయినట్లు తెలిపారు. మిగిలిన వారికి స్వల్ప గాయాలైనట్లు తెలిపారు. ఆటో అదుపుతప్పిన వెంటనే అటు గా వస్తున్న ప్రయాణికులు గమనించి క్షతగాత్రులను హుటాహుటిన పుట్టపర్తి ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పుట్టపర్తి రూరల్ పోలీసులు తెలిపారు.

రైలు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పట్టణంలోని సిద్దయ్యగుట్ట సమీపంలో రైల్వే ట్రాక్ దాటుతున్న గోవిందు (70) అనే వ్యక్తి రైలు కింద పడి మృతిచెందాడు. రైలు రావటాన్ని గమనించని గోవిందు ఈ ప్రమాదానికి గురయ్యాడు. ఈ ఘటన పై కేసు దర్యాప్తు చేస్తున్నటుల హిందూపురం జి అర్ పి రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఎర్రి స్వామి తెలిపారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

మండల పరిధిలోని ఎనుములపల్లి గ్రామంలో ఉన్న జడ్జి రాకేష్ తండ్రి జయరావు మృతిచెందాడు విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి జయరావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. జడ్జి కుటుంబాన్ని పరామర్శించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ టీడీపీ కన్వీనర్ రామాంజినేయులు, మున్సిపల్ మాజీ చైర్మన్ బెస్త చలపతి, గంగన్న,రామారావు, కూటమి నాయకులు,న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - మడకశిర

నూతనంగా ఎన్నికైన మార్కెట్ యార్డ్ ఛైర్మన్, డైరక్టర్లు రైతుల సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు సూచించారు. బుధవారం నిర్వహించిన నూతన మార్కెట్ యార్డ్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్, డైరెక్టర్లల ఆత్మీయ సమావేశం లో పాల్గొన్న ఎమ్మెల్యే రాజు, తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పే స్వామి మాట్లాడుతూ రైతులకు తగిన సహాయ సహకరాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి, జడ్పిటిసి ఉమేష్, మండల కన్వీనర్లు లక్ష్మీనారాయణ, మదనగుంటప్ప, కుమారస్వామి, గణేష్, దాసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు సమస్య పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - లేపాక్షి

మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామం నుండి ప్రధాన రహదారికి కలిసే రోడ్డు సమస్యను వెంటనే పరిష్కరించాలని ఎఐకెకెఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ సౌజన్య లక్ష్మికి, ఎంపిడిఒ నరసింహమూర్తికి అందజేశారు. ఈ సందర్భంగా ఆసంఘం జిల్లా కార్యదర్శి రంగనాయకులు మాట్లాడుతూ కొత్తపల్లి, నాగేపల్లి గ్రామాల నుండి ప్రధాన రహదారికి కలిసే రోడ్డు అస్తవ్యస్తంగా ఉందన్నారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కీర్తి, శంకర్ రెడ్డి, ప్రసూన్ తదితరులు పాల్గొన్నారు.

విఆర్ఎ కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - నల్లమాడ

మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన విఆర్ఎ ప్రసాద్(35) మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న సిపిఎం నాయకులు మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం నుంచి వచ్చే సాయం త్వరగా అందేలా తహశీల్దార్ దృష్టికి తీసుకుపోయి న్యాయం జరిగేలాగా చూస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు గోవిందు, మల్లికార్జున, రాజు తదితరులు పాల్గొన్నారు.

శవ రాజకీయాలకు పేటెంట్ హక్కు జగన్‌దే

ఎంపీ పార్థసారధి

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

శవరాజకీయాలకు పేటెంట్ హక్కు మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు ఉందని హిందూపురం ఎంపీ పార్థసారధి ఎద్దేవా చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మూడు తరాల నుండి హత్య రాజకీయాలు, శవ రాజకీయాలు చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారని ఆరోపించారు. రామగిరి మండలం పాపిరెడ్డి పల్లి గ్రామంలో రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణను రాజకీయం చేస్తూ లబ్ధి పొందాలని చూస్తున్నారని అన్నారు. ప్రభుత్వ వ్యవస్థలను, ప్రజాస్వామ్యాన్ని భ్రష్టు పట్టించిన ఘనత జగన్‌దేనని ఆరోపించారు.కనీసం ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని ప్రజాస్వామ్య బద్ధంగా నడుచుకోవాలని హితవు పలికారు.